# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన-1                                        16, డిసెంబరు, 2014

పేదలకు నిలువ నీడ కల్పించే విషయంలో అత్యంత ఉదారంగా ఉండాలని, భూ కబ్జాలకు పాల్పడే వారి విషయంలో మాత్రం అత్యంత కఠినంగా ఉండాలనేది ప్రభుత్వ విధానమని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు స్పష్టం చేశారు. హైదరాబాద్ నగరంలో భూ కబ్జాల దుకాణం బంద్ కావాలనేది తన లక్ష్యం అని, నగరంలోని ప్రజా ప్రతినిధులు, అధికారుల అందరి సహాకారం, సమన్వయంతో పనిచేస్తామని చెప్పారు. హైదరాబాద్ నగరంలోని పలు అంశాలకు సంబంధించి పార్టీల అభిప్రాయాలు తీసుకునేందుకు సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం మంగళవారం జరిగింది. ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలి, మంత్రులు పద్మారావు, మహేందర్‌రెడ్డి, తలసాని శ్రీనివాసయాదవ్, కాంగ్రేస్ ప్రతినిధులు మల్లు భట్టి విక్రమార్క, నిరంజన్, టిడిపి నుంచి ఎర్రబెల్లి దయాకర్ రావు, ఎల్‌వి.రమణ, నర్సిరెడ్డి, బిజేపి నుంచి కిషన్‌రెడ్డి, లక్ష్మణ్, యంఐయం నుంచి జాఫ్రి, సిపిఐ నుంచి చాడ వెంకట్‌రెడ్డి,రవీంద్రకుమార్, సిపియం నుంచి తమ్మినేని వీరభద్రం, సున్నం రాజయ్య, టిఆర్ఎస్ నుంచి వేణుగోపాలచారి, రాజేశ్వర్‌రెడ్డి, వైఎస్ఆర్‌సిపి నుంచి శివకుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్‌శర్మ, మెట్రో రైల్ ఎండి.ఎంవిఎస్ రెడ్డి, జిహెచ్ఎంసి కమీషనర్ సోమేష్‌కుమార్, రెవిన్యూ కార్యదర్శి మీనా, పంచాయతిరాజ్ కార్యదర్శి రేమాండ్ పీటర్, సిఎంఓ ముఖ్య కార్యదర్శి నర్సింగరావు, ప్రభుత్వ సలహదారు బివి.పాపారావు తదితరులు పాల్గోన్నారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు నగరంలోని ప్రభుత్వ భూముల ఆక్రమణలు, కబ్జాలు, పేదల నివాసాలు, రెగ్యులరైజేషన్ తదితర అంశాలపై రాజకీయ పక్షాల అభిప్రాయాలను తెలుసుకున్నారు. అంతకుముందు ముఖ్యమంత్రి ప్రభుత్వ లక్ష్యాలను విడమరచి చెప్పారు. హైదరాబాద్ నగరంలో భూముల రేట్లు పెరుగుతున్న కొద్ది భూ

ఆక్రమణలు కూడా పెరిగాయని, కబ్జా రాయుళ్లకు నగరంలో ప్రభుత్వ భూముల ఆక్రమణ అత్యంత సులువుగా మారిందని చెప్పారు. సాధారణ పౌరులు హైదరాబాద్‌లో భూములు కొనాలంటే ఒకటికి పది సార్లు ఆలోచించుకోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. భూ వివాదాలే ఇందుకు కారణం అని చెప్పారు. భూ ఆక్రమణలను పూర్తి స్థాయిలో అరికట్టాల్సిన అవసరం ఉందని, ప్రభుత్వ భూమిని ఎవరైనా ఆక్రమించాలంటే దడ పుట్టే పరిస్థితి రావాలన్నారు. అందు కోసం కఠినమైన చట్టాలు కూడా తెచ్చే యోచన వుందన్నారు.

హైదరాబాద్‌లో ప్రభుత్వ భూమి ఆక్రమణలు నాలుగు రకాలుగా జరిగాయని వివరించారు. వివిధ జిల్లాల నుంచి పొట్ట కూటి కోసం వచ్చే పేదలు ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్నారని, మధ్య తరగతి ప్రజలు నివాసం ఏర్పరుచుకోవడం కోసం ప్రభుత్వ భూమి అని తెలియకుండా మధ్య వర్తుల వద్ద కొనుక్కున్న ఉదంతాలు ఉన్నాయని, పాఠశాలలు, వైద్య శాలలు, ప్రార్థనా మందిరాల కోసం వాడుకుంటున్న భూమి ఉందని, కబ్జాదారులు యధేచ్ఛగా ఆక్రమించిన భూములు ఉన్నాయని, కబ్జాకు గురైన భూముల్లో కూడా కొన్నింటిలో నిర్మాణాలు ఉన్నాయని, మరికొన్ని ఖాళీ జాగాలు ఉన్నాయన్నారు. వీటన్నింటి విషయంలో ఒకే విధానం అనుసరించడం సాధ్యం కాదని కూడా ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారికి రెగ్యులరైజ్ చేసి నిధులు సమకూర్చుకోవడం ప్రభుత్వ లక్ష్యం కాదని, ఆ డబ్బులతోనే ప్రభుత్వం నడవదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచడం కొసం, భూ వివాదాలకు శాశ్వతంగా ముగింపు పలకడం కోసమే భూముల అంశాన్ని తీసుకున్నామని వెల్లడించారు. ఇందుకు ఒక్కో విషయంలో ఒక్కో రకంగా స్పందించాలని ముఖ్యమంత్రి ప్రతిపాదించారు.

1. 125 గజాల స్థలం లోపు నివాసాలు ఏర్పాటు చేసుకున్న పేదలకు ఉచితంగా రెగ్యులరైజ్ చేయాలి.

2. 250–300 గజాల స్థలంలో నివాసం ఉంటున్న మధ్య తరగతి ప్రజల పట్ల కూడా ప్రభుత్వం సానుభూతితో వ్యవహరిస్తుంది. కొద్దిపాటి ధర తీసుకుని వాటిని రెగ్యులరైజ్ చేస్తుంది.

3. 500 గజాల లోపు నివాస స్థలాలు ఏర్పాటు చేసుకున్న వారి భూములను 100 గజాలకు కొంత ధరను పెంచుతూ రెగ్యులరైజ్ చేస్తుంది.

4. 500 గజాలకు పైగా భూమిని ఆక్రమించుకొని నివాసాలు, శాశ్వత నిర్మాణాలు ఏర్పాటు చేసుకున్న వారికి భారీ మొత్తంలో ధర నిర్ణయించి రెగ్యులరైజ్ చేస్తుంది.

5. ఖాళీ జాగాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి.

6. 15 నుంచి 50 గజాల లోపు స్థలంలో నివాసం ఉంటున్న వారందరిని ఒక పూల్ గా మార్చి వారికి బహుళ అంతస్థుల భవనాలు కట్టించి మెరుగైన నివాసాలు అందించాలి.

ముఖ్యమంత్రి చేసిన ఈ ప్రతిపాదనలపట్ల రాజకీయ పక్షాలన్నీ ఆమోదం, హర్షం తెలిపాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ పైన చెప్పిన 6 సందర్భాలను నిర్ధారించడానికి, ఎవరెవరు ఏ కేటగిరి కిందికి వస్తారో నిర్ణయించడానికి నియోజకవర్గాల వారిగా ఎమ్మెల్యేలు, అధికారులు కమిటీలుగా ఏర్పడాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణకు సంబంధించిన విషయంలో ప్రభుత్వం రాజకీయ పట్టింపులకు పోకుండా అందరిని పరిగణలోకి తీసుకుంటుందని ప్రకటించారు. పార్టి ఏదైనప్పటికి ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల పర్యవేక్షణ, సహకారంతోనే భూ కబ్జాలు లేని హైదరాబాద్ నగరాన్ని సృష్టించాలని తాను భావిస్తున్నట్లు వెల్లడించారు.

---

సిపిఆర్ఓ టు సిఎం